# శపథం

"సోవుడూ, బట్టీ దగ్గిర పని జాగర్తగా అవుతోందా" అన్నాడు బుంగ రామయ్య.

"అవుతోందన్నా" అన్నాడు బుంగ సోమయ్య వినయంగా. వాళ్ళిద్దర్నీ నచ్చినవాళ్ళు "రామలచ్మణులు" అంటారు. కిట్టనివాళ్ళు "దుర్యోదన దుచ్చాసనులు" అంటారు. బుంగ రామయ్యను కొందరలాగే అంటారు. మరికొందరు 'దొంగరాముడు' అంటారు. ఇంకొందరు 'దుంగరామయ్య' అంటారు. దొంగరాముడుగా పేరుతెచ్చుకున్నప్పుడు బక్కగావున్న బుంగరామయ్య, బాగా డబ్బు గడించాక, దుక్కలా బలిసి 'దుంగరామయ్య' అయ్యాడు.

"బట్టీ దగ్గరికి బేగెళ్ళు. నువ్వు నేకుంటే ఒక్క ఎదవా ఒళ్ళొంచి పన్జేయడు" అన్నాడు రామయ్య గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ నోట్లో పెట్టుకుంటూ.

"అట్టాగే అన్నా" అని సోమయ్య గబుక్కున కుర్చీలోంచి లేచి బయలుదేరాడు.

వెళ్తున్న సోమయ్యవంక అభిమానంగా చూశాడు రామయ్య.

తొమ్మిదేళ్ళ వయసులోనే రామయ్య సింహాద్రిరాజు దగ్గర పనిలోకి కుదిరాడు. పశువుల్ని మేపుకొచ్చేవాడు. పదకొండేళ్ళు వచ్చేటప్పటికి కొబ్బరిచెట్లెక్కి కాయలు దింపడం కూడా మొదలెట్టాడు. ఒకనాడు కొబ్బరికాయలు దించాక, చెట్టుదిగి వస్తూ, దగ్గువస్తే కాండ్రించి ఉమ్మాడు. అది ఓ కొబ్బరికాయమీద పడింది.

"ఛీఛీ. అదేం పనిరా తొత్తుకొడక. ఆ కాయని దూరంగా పెట్టు" అన్నాడు సింహాద్రి రాజు కోపంగా.

రాముడు అలాగే చేశాడు. కాయలన్నీ కొట్టుగదిలోకి మోసుకెళ్ళాడు.


"ఈ కాయ కడిగేసి, కొట్టుగదిలో ఏసేస్తానండి" అన్నాడు రాముడు నెమ్మదిగా.


"ఛూఛూ. నువ్వు వుమ్మేసిన కాయని కొట్టుగదిలో పడేస్తావా? ఛీఛీ. దాన్ని ఇంటికి పట్టుకుపో". అన్నాడు సింహాద్రిరాజు అసహ్యంగా ముఖం పెట్టి.

రాముడు సంతోషంగా ఆ కొబ్బరికాయను ఇంటికి కాకుండా కిరాణాకొట్టుకు పట్టుకెళ్ళి అణాకు అమ్మేసి, సీమచింతకాయ బిళ్ళలు కొనుక్కున్నాడు.

"ఈ రాజుగోరికి చేదస్తం ఎక్కువని వూరోళ్ళంతా అంటుంటే ఏమో అనుకున్నాను. మా శానా వుంది" అనుకున్నాడు రాముడు బిళ్ళ చప్పరిస్తూ.

ఓ నెల పోయాక మళ్ళీ కొబ్బరికాయలు దించాక, కావాలనే రెండు కొబ్బరికాయలమీద వుమ్మేశాడు రాముడు. సింహాద్రిరాజు కోప్పడి, వాటిని పట్టుకుపొమ్మన్నాడు. ఆ రెండు కాయల్నీ కిరాణాకొట్టులో







అమ్మేసి, సీమచింతకాయ బిళ్ళలతో పాటు కరీంబీడీల్ని కూడా కొన్నాడు రాముడు. మరికొన్నాళ్ళకు మూడు కొబ్బరికాయలమీద ఉమ్మాడు. రాముడు కావాలనే చేస్తున్నాడని గ్రహించి, సింహాద్రిరాజు రెండు తగిలించాడు. ఆ తర్వాత సింహాద్రిరాజు కళ్ళుకప్పి కొబ్బరికాయలు కిరాణాకొట్టుకు చేర్చడం మొదలెట్టాడు. ఒకనాడు దొరికిపోయాడు. దెబ్బలు తిన్నాడు. పాలికాపు పనిపోయింది.

దొంగరాముడిని పనిలోకి తీసుకోడానికి రైతులంతా వెనుకాడారు. కూలిపనులకెళ్ళాడు. ధాన్యం పనల్ని ఎత్తుకుపోయాడు. రాముడిని చెట్టుకు కట్టేసి చితకబాదారు. అదిచూసి సోముడు ఏడ్చేశాడు. ఇంటికొచ్చాక, "అలాంటి పన్లు సెయ్యొద్దన్నా" అన్నాడు.

కొన్నాళ్ళు అల్లరి చిల్లరిగా తిరిగి, ఓ రాత్రి షావుకారింట్లో బంగారం గొలుసు ఎత్తుకుపోయాడు. అలా పోయి మళ్ళీ సొంత వూరికి తిరిగిరాలేదు. కొన్నాళ్ళు బ్రాకెట్ బుక్కర్‌గా పనిచేశాడు. అందులోని మెళకువలన్నీ తెలుసుకుని, బ్రాకెట్ కంపెనీ పెట్టాడు. ప్రైవేట్ బస్సుల్ని జాతీయం చేసినప్పుడు, చవగ్గా వస్తుంటే ఓ బస్సుకొని టూరిస్టు బస్సుగా నడిపాడు. తర్వాత సారా పాటలు పాడి, ఆ వ్యాపారం కొనసాగిస్తున్నాడు.

రామయ్య రొయ్యలకూరతో సుష్టుగా భోంచేసి, బెడ్‌రూంలోకొచ్చాడు. సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ములాగాడు. మంచమెక్కి, సుఖంగా నడుంవాల్చాడు.

బెడ్‌రూమ్ మొజాయిక్ ఫ్లోర్ మిలమిలా మెరుస్తోంది పులికన్నులా. తెల్లగా తళతళలాడుతున్న ఓ గోడమీద కళకళలాడుతోంది ఓ ఆంగ్ల నగ్నసుందరి. ఆ తెల్లసుందరి ప్రత్యేకత ఏమిటంటే, గదిలోంచి ఎటువేపునుంచి చూసినా, చూసినవాళ్ళవంక ఆమె దొంగ చూపులు చూస్తుంది. ఆ నగ్నసుందరి దొంగ చూపులంటే దొంగరామయ్యకెంతో ఇష్టం. "నాకు సరిజోడీ. మా సక్కటి దొంగనంజ" అని మెచ్చుకుంటాడు.

రామయ్య హాయిగా నిద్రపోయి లేచాడు. టీ తాగాడు. లాల్చీవేసుకుని ఇంటి (మేడ)ముందు లాన్‌లో కుర్చీలో కూర్చుని సిగరెట్ ముట్టించాడు. లాన్ పచ్చ పచ్చగావుంది. సిగిరెట్ దమ్ము వెచ్చవెచ్చగా వుంది. గత రాత్రి వుంచుకున్నదాని సరసం తలచుకుంటే అతనికి ముచ్చట ముచ్చటగా వుంది. టైము చూశాడు. అయిదు గంటలయ్యింది.

"ఏడింటికల్లా కాంతారావు వచ్చేస్తాడు. ఆడికూడా ఇద్దరాఫీసర్లొస్తారు. ఇదేశీ యిస్కీ అట్రడీగా వుందింట్లో. తొమ్మిదింటికల్లా పార్టీ అయిపోవాల. కాంతారావుకంతా డిసీప్లీను. ఎళ్ళేటప్పుడు ఆడికివ్వడానికి పదేనేలు కవర్లోయెట్టి వుంచేనుగందా. డబ్బు దగ్గిర కరాకండీగా వుంటాడుగానీ, కాంతారావు మంచోడు. నాకే కట్టవొచ్చినా ఆదుకుంటాడు. రాజకీయంగా ఆడి పలుకుబడి అంతా ఇంతానా. ఆడింకా పైకెళ్తాడు" అనుకున్నాడు రామయ్య కళ్ళు మూసుకుని సిగరెట్ కాలుస్తూ.

రామయ్య మేడకు అల్లంత దూరంలో సూర్యకిరణాలు పడి, పచ్చకొండ పసిడిముద్దలా మెరుస్తోంది. పచ్చకొండ మీద మేత మేస్తున్న గొర్రెలు ఆకాశం నుంచి షికారుకొచ్చిన తెల్లమబ్బుల్లా వున్నాయి. ఈ

పచ్చదనం అంతా తమదే అనుకుంటున్న తెల్ల గొర్రెలకు తమ ప్రాణాలు తమవి కావని తెలీదు. షికారుకొచ్చిన తెల్లమబ్బులకూ తాము నీరయి కరిగిపోతామని తెలీదు. తెల్ల గొర్రెలూ తమకోసం తిండి తినడంలేదు. తెల్లమబ్బులూ తమకోసం షికారుకు రాలేదు.

సిగరెట్ పారేసి, ఒళ్ళు విరుచుకుని కుర్చీలోంచి లేచాడు రామయ్య. పచ్చని లాన్‌లో తెల్లలుంగీ, తెల్ల లాల్చీలో పచార్లు చేస్తున్న రామయ్య పైరుచేనుపై చక్కర్లు కొట్టే తెల్లరాక్షసి కొంగలా వున్నాడు.

గేటు తీసుకుని వస్తున్న నౌఖర్ని చూశాడు. అతని భుజంపై వున్న తోలు తీసేసిన గొర్రెపిల్లను చూశాడు.

"పలావు బాగా సేయించు" అన్నాడు రామయ్య అతనితో.

చీకటి పడింది. రామయ్య ఇంట్లోకి వెళ్ళాడు. వేణ్ణీళ్ళ స్నానం చేశాడు. బట్టలేసుకుని విదేశీ సెంటు రాసుకున్నాడు. టీ తాగాడు. పలావ్ వంటకం ఎంతవరకూ అయ్యిందో వాకబు చేశాడు. హాల్లో టీవీ చూస్తూ కూర్చున్నాడు.

"ఇంకోసారి టీ పంపమన్నావేటి" అంది రామయ్య భార్య పక్కనే కుర్చీలో కూర్చుంటూ.

"ఇప్పుడే తాగేనుకదా, వద్దులే. అయినా ఇది టీ యేళేటి" అన్నాడు నవ్వుతూ.

"సాల్లే సంబడం" అని ఆమె కూడా నవ్వి, "మన బేబీ ఈ ఏడు డాక్టరయిపోతందిగందా. మనూళ్ళో పేక్టీసు యెట్టుకోడానికి ఏర్పాట్లు మొదలెట్టావా" అంది.

"ఓసోస్. బేబీ నీకేనేటే కూతురు. అన్నేర్పాట్లూ సేయిస్తున్నా. నువ్వేటీ ఇదయిపోకు"

"నా తల్లి మనసు నాదిలే. సేస్తన్నావుగందా, ఇంకేటి బెంగ" అంది తృప్తిగా చూస్తూ.

రామయ్య గోడగడియారం వంక చూశాడు. పది నిమిషాలు తక్కువ ఏడయింది.

"పలావు రుసి సూసేవా"

"సూసేను. సక్కగా కుదిరింది"

'గుడ్' అన్నట్టు ఆమెవంక చూసి "అన్నీ టేబుల్ మీద రెడీగా పెట్టించు. పని కుర్రోళ్ళిద్దర్నీ పార్టీ అయ్యేదాకా వుండమను" అని భార్యతో చెప్పి, లాన్‌లోకెళ్ళాడు.

అంతలో కాంతారావు కారు గేటు ముందాగింది. రామయ్య గబగబా అటు వెళ్ళాడు.

"నమస్కారం కాంతన్నా"

"నమస్తే రామన్నా"

ఇద్దరూ కౌగిలించుకున్నారు. ఆఫీసర్లిద్దరూ రామయ్యకు విష్ చేశారు. అంతా రామయ్య ప్రైవేటు రూమ్‌లోకెళ్ళారు. గది చల్లగా పెరుగన్నం తిన్న బొజ్జలా వుంది. విదేశీ విస్కీ బాటిల్ 'సరిలేరు నాకెవ్వరూ' అని గర్వించే సుందరాంగిలా వుంది. విస్కీ బాటిల్ మూత 'కొప్పుచూడు, కొప్పందం చూడు' అని ఛాలెంజ్ చేస్తున్నట్టుంది.

రామయ్య విస్కీ బాటిల్ మూత తీసి, నాలుగు గ్లాసుల్లో పోశాడు. పనికుర్రాడు ఐసు ముక్కలేసి,

సోడాతో గ్లాసులు నింపాడు. గ్లాసులందుకుని, పైకెత్తి ఛీర్స్ చెప్పుకున్నారు. అప్పుడే వేయించిన జీడిపప్పు పలుకులు తింటూ, సినిమా కబుర్లు చెప్పుకుంటూ తాగారు.

ఒక రౌండ్ అయింది. ఖాళీ గ్లాసులు మళ్ళీ విస్కీ సోడాలతో నిండాయి.

"ఏటి రామన్నా. ఈ పద్దిన బాగానే సంపాయించుంటావే" అన్నాడు కాంతారావు గ్లాసందుకుంటూ.

"సారా నిషిద్ధం పున్నెమాని ఏదోలే"

"ఏడెనిమిది లకారాలుంటుందా"

"మా బలేవోడివి కాంతన్నా. అంతుంటే ఇంకేటి. రెండు లకారాలు మించదు" అన్నాడు రామయ్య.

'నిజం సెప్పేనంటే ముప్పయ్యేలు కావాలంటాడు' అనుకున్నాడు కాంతారావు వంక చూడకుండా గ్లాసువంక చూస్తూ.

'ఈడి యవారం సూస్తంటే నిజం సెబుతున్నట్టు లేదు' అనుకుని, "నీకన్నా సిన్న యాపారులే ఆరేసి లకారాలు కళ్ళ సూసేరు" అన్నాడు కాంతారావు.

"అళ్ళలా నేను మరీ ఆసెపోతును కాదుకదా కాంతన్నా. ఏదో రీజనబుల్ రేటుకు మిగిలిన సారా పేకెట్లన్నీ అమ్మించాను. పేదోళ్ళని మరీ పీక్కుతినేకూడదు. ఏటంటావు"

"రాజకీయాల్లో వున్నోడ్ని. నేనేటంటాను. నీమాట రైటేనంటాను"

"సరేగానీ కాంతన్నా, ఈసారన్నా నీకు ఎమ్మెల్యే టిక్కెట్టొస్తదంటావా"

'తప్పకొస్తది. శానా పకడ్బందీగా పని సేస్తున్నానులే ఈసారి" అన్నాడు కాంతారావు ఖాళీగ్లాసు టేబుల్‌మీద పెడుతూ.

"నీకొస్తే నాకంటే ఆనందించేవోడింకోడుండడు కాంతన్నా" ఖాళీ గ్లాసులు నింపమని కుర్రోడికి సంజ్ఞచేస్తూ అన్నాడు రామయ్య.

ఇంతలో సోమయ్య వచ్చాడు.

"సోవుడూ, సరుకంతా ఎలిపోయిందా"

"పంపేసేనన్నా"

"దాదా, ఇలా కూసో" అని రామయ్య తమ్ముడికి గ్లాసందించాడు.

సోమయ్య బిడియంగా గ్లాసందుకున్నాడు. విస్కీ చప్పరించాడు. గ్లాసు సగం పూర్తయ్యేటప్పటికి రామయ్య మీద ప్రేమ రెట్టింపయింది.

"నన్నంతా రామయ్యగారి తమ్ముడనే అంటారు. అనుకోనీ. అన్నవల్లే కదా ఇంత సుకంగా వున్నాను. ఇదేసీ ఇస్కీ తాగుతున్నానంటే అన్నవల్లేకదా. అన్న లేకుంటే ఆ పొలాల్లో నడుం యిరిగేదాకా వరిసేను కోస్తానో, దాన్యం బత్తాలు మోస్తానో వుండేవాణ్ణి. అప్పుడు తాగితే తిండికి సరిపోయేదికాదు. తింటే తాగుడికి డబ్బులుండేవి కావు. ఇప్పుడో మరి! సికెన్ పులావులు, మేడలు, మిద్దెలు, అంతా అన్నవల్లేగందా" అనుకుంటే సోమయ్యకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

గ్లాసు పూర్తిచేసి రెండో రౌండ్‌కొచ్చాడు.

'అందుకే అన్న ఏటి సెబితే అది సేసేత్తాను కళ్ళు మూసుకుని. ఆమద్దిన అన్న వుంచుకున్న దానిమీద తాతిగాడు కన్నేసేడని తెలవగానే అణ్ణి ఏసేసేను. కేసవకుండా అన్న సూసుకున్నాడు. నాకోసం ఎన్నేలు కరుసు పెట్టేడో' అనుకుంటూ రామయ్యవంక భక్తితో చూశాడు సోమయ్య.

మందు అయ్యేక విందు కూడా పూర్తి చేశారంతా. రామయ్య ఇచ్చిన కవరందుకుని కాంతారావు బృందం వెళ్ళిపోయింది.

రామయ్య తన బెడ్‌రూమ్‌కు, సోమయ్య తన ఇంటికి వెళ్ళిపోయారు. నిశ్చింతగా నిద్రపోయారు.

ఆ చీకటి రాత్రి అమృతం కురియలేదు. ఆ చుట్టుపక్కల చుట్టలా చుట్టుకుని పడుకున్న ఆ చీకటి రాత్రి కదిలి కదిలి నల్లనాగులా బుసలు కొట్టి విషం కక్కి, శోకపు నరకం తెరతీసింది.

తెల్లవారక ముందే సోమయ్య ఉరుకులూ పరుగులతో రామయ్య దగ్గరకొచ్చాడు.

"అన్నా కొంప మునిగింది. మనసారా తాగినోళ్ళు శానామంది సచ్చిపోనారంట. ఆస్పిటల్లో వందమంది దాకా సేరేరంట"

"అలాగా, నువ్వేం బయపడమాక. ఆ సారా మందేనని రాసుందేటి? లేదుగందా. కాంతన్నకు ఫోను సేస్తానుండు, ఎందుకైనా మంచిది" అని రామయ్య తాపీగా డయల్ చేశాడు.

కల్తీసారా బాధితుల్ని పరామర్శించడానికి కాంతారావు ఆసుపత్రికి వెళ్ళాడని తెలిసింది.

"సోవుడూ, నువ్వెంటనే మన బట్టీ దగ్గరికెళ్ళి అక్కడి పనులాపుజేయించు. అంతా సుబ్బరం సేయించు. అక్కడేవీ జరగనట్టుండాలన్నమాట"

"అట్టాగే అన్నా" అని సోమయ్య వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రానికి కానీ కాంతారావు ఇంటికి రాలేదు. రామయ్య లక్ష-రూపాయలు బేగ్‌లో పెట్టి తీసుకెళ్ళాడు.

"కూచో రామన్నా, శానా అలసిపోయేను" అంటూ విదేశీ విస్కీ బాటిల్ ఓపెన్ చేశాడు.

ఆఫీసర్లకు కబురెట్టాడు. ఓ పావుగంటకు వాళ్ళు వచ్చి వీళ్ళతో చేరారు. రామయ్య పేరు బయటపడకుండా ఏదెలా చెయ్యాలో చర్చించుకున్నారు. రామయ్య తెచ్చిన బేగ్ తీసుకుని ఆఫీసర్లకు కొంత ఇచ్చి, మిగతాది తన దగ్గర వుంచాడు కాంతారావు. ఆఫీసర్లు వెళ్ళిపోయారు.

"రామన్నా, ఏది సేసినా జాగర్తగా సెయ్యాల. సారాలో అయ్యేవో రసాయనాలు కలిపేయించినట్టున్నావు. ఇప్పుడు సూడు, నలబైమంది సచ్చేరు. ఆస్పిటల్లో సేరినోళ్ళలో ఇంకెంతమంది సస్తారో సెప్పలేం" అన్నాడు చిరాగ్గా ముఖం పెట్టి.

"ఇలాటియేయి సేయకపోతే యాపారాల్లో నాబాలెట్టా వస్తాయి సెప్పు కాంతన్నా. నేనేవన్నా ఒరేబాబూ నా సారా తాగొరే అని బతిమాలానా? ఆళ్ళకి సవగ్గా సారా గావాల గనక నేను సేయించేను. అయితే ఈసారి ఆ కెమికల్సు పాలు ఎక్కువైనట్టుంది. అంతెందుకు, ఈ యిస్కీని మన్లాంటోళ్ళు

ఎంతయినా యెట్టి కొని తాగలం కాబట్టేగందా అళ్ళు తయారు చేస్తున్నారు. ఏటంటావు" అన్నాడు రామయ్య ఖాళీగ్లాసు టేబుల్‌మీద పెడుతూ.

"నేనేటంటాను. నువ్వు రైటేనంటాను. ఇంకెంతమంది ఆఫీసర్లకు ఎంత తడపాలో"

"నువ్వేటి సేస్తావో నాకు తెల్దు. ఇంకొక్క పైస ఇవ్వను".

"సర్లే, ఇంకిదయిపోకు" అన్నాడు కాంతారావు గ్లాసు నింపుతూ.

ఆ రాత్రి వాళ్ళకలా గడిచింది. కల్తీసారా తాగినోళ్ళలో మరో పదిమంది మరణించారు. ఇంకొందరి పరిస్థితి ప్రమాదకరంగా వుంది.

ఇది జరిగిన మూడోరోజు రాత్రి మూడో పెగ్గులో వుండగా రామయ్యకు సోమయ్య చావు కబురందింది. రామయ్యకు గుండాగిపోయినంత పనయింది. సోమయ్యను ఎవరో గొడ్డలితో నరికి చంపేశారని నౌకరు చెప్పగానే రామయ్య పరిగెట్టాడు.

నెత్తుటిమడుగులో వున్న సోమయ్యను చూడగానే రామయ్య గుండె చెరువయింది.

"సోవుడూ, నా బంగారు తమ్ముడూ, నన్నిడిసి ఎళ్ళిపోనావా. నేనంటే పేణం యెట్టేవోడివి. సివరికి పేణం పోగొట్టుకున్నావుకదారా. నీ బదులు నేను పోయినా ఎంత బావుండునురా. నన్నింక 'అన్నా' అని పేమగా పిల్చేవోళ్ళెర్రా. ఒరే తమ్ముడూ సోవుడూ నాయనా నువ్వు నేకుండా నేనెట్టా బతికేదిరా" అంటూ రామయ్య భోరున ఏడుస్తుంటే, అప్పుడే అక్కడికొచ్చిన కాంతారావు కడుపు తరుక్కుపోయింది.

"ఊరుకో రామన్నా, సోమయ్యకూ మనకూ రుణం తీరిపోనాది. జరగాల్సింది సూడు" అని కాంతారావు రామయ్యను ఓదార్చబోయాడు.

ముక్కు చీది, కళ్ళు తుడుచుకుని, "కాంతన్నా, సూత్తాను. ఇది అడిపనే. మా సోవుడిమీద బదులు తీర్చుకున్నాడు. ఆ తాతిగాడి అన్ననే కనక నేను లేపెయ్యకపోతే నా పేరు రామయ్యే కాదు" అని శపథం చేశాడు రామయ్య పళ్ళు పటపట కొరుకుతూ.

మరి, కల్తీసారా బాధితుల్లో కూడా ఎవరైనా అలాంటి శపథం చేసివుంటారా?

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక, 25.2.94)*